క్లుప్తంగా

సీఎంను కలిసిన దొరబాబు కుటుంబ సభ్యులు


జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన దొరబాబు కుటుంబ సభ్యులు

సామర్లకోట: రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు కుటుంబ సభ్యులు శనివారం భోగి పండగను పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రిని కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నివాసంలో దొరబాబు కుటుంబ సమేతంగా కలిశారు.

నేడు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభ లైవ్

సామర్లకోట: సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వరకు నూతనంగా ఏర్పాటు చేసిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఆదివారం ప్రధాని మోదీ ఢిల్లీలో ఆన్‌లైన్‌లో ప్రారంభిస్తారని స్థానిక స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. ఈ మేరకు ఉదయం 10 గంటలకు ప్రధాని ప్రసంగాన్ని రైల్వే స్టేషన్‌లోని ఎల్‌సీడీ ద్వారా లైవ్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశామని తెలిపారు. రైల్వే ప్రయాణికులు పాల్గొన్ని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. అదే విధంగా సాయంత్రం ఆరు గంటలకు సామర్లకోట స్టేషన్‌కు ఈ రైలు వస్తుందని ఆసక్తి కలిగిన వారు తిలకించవచ్చన్నారు.

17 నుంచి మహాలక్ష్మి, పాలమ్మ అమ్మవార్ల ఉత్సవాలు

సామర్లకోట: మండల పరిధిలో జి.మేడపాడు గ్రామంలో వేంచేసి యున్న మహాలక్ష్మి, పాలమ్మ అమ్మవార్ల దేవాలయంలో ఈనెల 17 నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మోరంపూడి శ్రీరంగ నాయకులు తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 17, ఆలయంలో యజ్ఞాది కార్య క్రమాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని చెప్పారు. 18వ తేదీ అమ్మవార్లకు మహా కుంభాభిషేకాలు, అనంతరం భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాలు ఉంటా యని తెలిపారు.

పేదలకు దుస్తుల పంపిణీ


పేదలకు దుస్తులు అందజేస్తున్న అపర్ణా సేవా ట్రస్టు సభ్యులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో శనివారం స్థానిక శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. సుమారు 300 మంది మహిళలకు దుప్పట్లు, చీరలు, పురుషులకు దుప్పట్లు పంచెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ తమ ట్రస్టు ద్వారా నిరు పేదలకు చేతనైనంత సాయం చేయడానికి ఎప్పుడు సిద్ధంగా ఉంటామన్నారు. శ్రీఅపర్ణా సేవా ట్రస్టు చైర్మన్ ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకరశాస్త్రి, ఆవంత్స ప్రసాద్, ఆకుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు


ముగ్గు వేస్తున్న మహిళ

పిఠాపురం: గొల్లప్రోలు పాదాంబిక అమ్మవారి ఆలయం వద్ద సంక్రాంతి సందర్భంగా స్థానికులు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో పలువురు మహిళలు ఆసక్తికరంగా పాల్గొన్నారు. వివిధ ఆకృతుల్లో పకృతి, వ్యవసాయం, సంక్రాంతి సంబరాలు వంటి అంశాలతో వేసిన రంగవల్లులు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి.

కోస మాంసానికి డిమాండ్


కోస (పందెంలో ఓడిన పుంజు)

కొత్తపల్లి: కోస మాంసానికి డిమాండ్ పెరిగింది. కోస మాంసం కోసం ఎగబడుతున్నారు. మూడు కిలోల కోస మాసం రూ.3500 నుంచి రూ. 5000 వరకూ పలుకుతోంది. ఇదే సమయంలో పందెంరాయుళ్ల అధికారులు, అనాధికారులు, అభిమానులు, బంధువులకు కోస మంసానివ్వడంతో మరింత డిమాండ్ పెరిగింది. ఆదివారం ధర మరింత పెరిగే అవకాశం ఉందని మాసం ప్రియులు చెబుతున్నారు.

ఘనంగా భోగి పండగ


పెద్దాపురంలో భోగి మంట వద్ద చిన్నారులు



సామర్లకోటలో భోగి మంటల వద్ద పిల్లలు పెద్దలు


ముగ్గులు వేస్తున్న మహిళలు

పెద్దాపురం: పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో భోగి పండగను శనివారం ఆయా ప్రాంతాల్లో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. పిన్న, పెద్ద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ వేకువ జామున లేచి అభ్యంగన స్నానమాచరించి కొత్త బట్టలు ధరించి పిల్లలు పిడకలతో చేసిన పిడకల దండతో భోగి మంటల వద్దకు చేరుకుని సందడి చేశారు. ఆయా ప్రధాన కూడళ్ల వద్ద భారీ దుంగలతో యువకులు భోగి మంట వేశారు. సినిమా థియేటర్లు, కోడి పందేల వద్ద సందడిగా గడిపారు.

ఉత్సాహంగా భోగి పండగ

సామర్లకోట: భోగి పండగ వేడుకలను శనివారం పిల్లలు, పెద్దలు ఉత్సాహంగా జరుపుకొన్నారు. సంక్రాంతి పండగకు స్వాగతం పలుకుతూ భోగి పండగను నిర్వహిస్తారు. ఈ మేరకు తెల్ల వారు జామునే భోగి పంటలను ఏర్పాటు చేశారు. ప్రతి వార్డులో మూడు నుంచి నాలుగు వరకు భోగి మంటలు ఏర్పాటు చేశారు. పిల్లలు తల స్నానం చేసి కొత్త బట్టలు ధరించి ఆవు పేడతో తయారు చేసిన పిడకల దండలతో భోగి మంటల వద్దకు వెళ్లి ఆ మంటల్లో వేశారు. అదే విధంగా భోగి రోజున చిన్నారులకు రేగుపళ్లు, చెరకు ముక్కలు, పూలతో భోగి పండ్లు వేశారు.

కొత్తపల్లి: మండలంలో వాడవాడలా శనివారం భోగి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రతి వీధిలోనూ భోగి మండలు వేశారు. ఇంటిళ్ల పాది కొత్త బట్టలు ధరించి ఉత్సాహంగా పండగ జరుపుకొన్నారు. కొత్త అల్లుళ్ల, రకరకాల పిండి వంటలు, భోగి మంటలు, గంగిరెద్దుల ఆటలు, హరిదాసుల హరినామ సంకీర్తనలతో గ్రామాల్లో సందడి నెలకొంది.


హరిదాసుకు కానుక వేస్తున్న చిన్నారి

రమణక్కపేటలో..

రమణక్కపేటలో సంక్రాంతి సంబరాలను శనివారం గ్రామ సర్పంచ్ కాజులూరి అమ్మజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని బహుమతులను అందిజేశారు.

సంప్రదాయబద్ధంగా...

కొత్తపల్లి: సంక్రాంతి పండగను అందరూ సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని అదనపు జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. మండలంలోని వాకతిప్ప, కొనపాపేటలో శనివారం సంప్రదాయ కోడి పందాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, సర్పంచులు కర్రి చిన్నారావు, నక్కా మణికంఠ, పాలాని దొరబాబు, ఎంపీటీసీలు రాయుడు విష్ణు, అనిశెట్టి సుభాషిణీ, మాజీ ఎంపీపీ అబ్బిరెడ్డి భావనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సౌభాగ్యాల సంక్రాంతి

- నేడు మకర సంక్రాంతి
- పెద్ద పండుగకు ఘనంగా ఏర్పాట్లు
- కళకళలాడుతున్న గ్రామాలు
- వైష్ణవాలయాలలో ప్రత్యేక పూజలు

పిఠాపురం: భోగభాగ్యాల భోగి పండుగతో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. అన్ని వీధుల్లోను భోగిమంటలు భగభగమండుతుంటే సంక్రాంతి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.


భారీ భోగి పిడకల దండతో మహిళలు

సూర్యుడు ధనూరాశి నుంచి మకరరాశిలో ప్రవేసించే సమయమే మకర సంక్రాంతి. మూడు రోజులు పండుగైన మకర సంక్రాంతి కన్నులు పండుగగా నిర్వహించేందుకు గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తవడంతో గ్రామీణా ప్రాంతాలు కళకళాడుతున్నాయి. ఉత్తరాయన పుణ్యకాలం ప్రారంభం కావడంతో దేవాలయాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. మకర సంక్రాంతి సందర్భంగా ఆదివారం అన్ని దేవాలయాల్లోనూ ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. మరో పక్క శనివారం పిఠాపురంలో వీధులన్నీ జనంతో కిటకిటలాడాయి. పిఠాపురం అయ్యప్ప స్వామివారి దివ్యాభరణాల ఊరేగింపు కనుల పండువగా నిర్వహించగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆ దివ్యాభరణాలను శిరస్సున ధరించి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం జ్యోతి దర్శనం ఘనంగా నిర్వహించారు.


అయ్యప్ప స్వామివారి దివ్యాభరణాల ఊరేగింపుగా తీసుకువస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు


పిఠాపురం కోటగుమ్మం సెంటర్లో భోగి మంటకు పూజలు నిర్వహిస్తున్న జైగణేష్ ఆలయ అర్చకుడు

సంపదను ప్రసాదించే కనుమ

సంక్రాంతి మరునాడు వచ్చే కనుమ పండుగకు విశిష్ట స్థానం ఉంది. పశు సంపదను లక్ష్మీదేవి ప్రతి రూపాలుగా బావించి పూజించే పండుగే కనుమ. కనుమ రోజున కళకళలాడుతున్న ధాన్యపు రాసులకు రైతులు పూజలు నిర్వహిస్తుంటారు. పశువులను శుభ్రంగా కడిగి పూల దండలతో అలంకరిస్తారు. ప్రత్యేక పూజలు సైతం చేస్తారు. కనుమ పండగ నాడు మినుములతో చేసిన వంటకాలకు ప్రాధాన్యమిస్తారు. అందుకే కనుమ పండు నాడు భోజనాల్లో గారెలు, చిన్నుండలు తప్పనిసరిగా వడ్డిస్తారు. వివిధ రకాల కూరగాయలతో తయారు చేసే కలగలుపు కూరలను తింటుంటారు. కనుమనాడు కాకైనా కదలదన్ననానుడి ఉండడంతో ఆ రోజున ఎవ్వరూ ప్రయాణాలు చేయరు. ఇంటి వద్దే ఉండి పిల్లలు, బంధువులతో సరదాగా కాలం గడుపుంటారు. పిఠాపురం నియోజకవర్గంలో పలు గ్రామాల్లో కోడి పందాలు జోరుగా సాగాయి.

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం


సామర్లకోటలోని మాండవ్యనారాయణ స్వామి కల్యాణం

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువ తీరాన వేంచేసిన మాండవ్యనారాయణస్వామి ఆలయంలో శనివారం గోదాదేవి కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గత నెల 16 నుంచి ఆలయంలో ధనుర్మాస పూజలు జరుగుతున్నాయి. ఈ పూజల ముగింపును పురస్కరించుకొని భోగి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పారిశ్రామిక వేత్త సింగ వరపు సత్యనారాయణ దంపతులు పీటలపై కూర్చొని కల్యాణం నిర్వహించారు. పారిశ్రామిక వేత్తలు సింగవరపు సాయిబాబు, బిక్కిన సాయి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. స్వామి కల్యాణాన్ని అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

కొత్తపల్లి: స్థానికంగా రుక్మిణీ సత్యబామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. వేద పండితులు స్వామివారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, కల్యాణం చేశారు. కొత్తపల్లి గ్రామం నుంచే కాకుండా వాకతిప్ప, కుతుకుడుమిల్లి, ఉప్పాడ తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

బెంగళూరులో సీఐటీయూ అఖిల భారత మహాసభలు

కాకినాడ సిటీ: సీఐటీయూ 17వ అఖిల భారత మహాసభలు బెంగళూరు నగరంలో ఐదు రోజుల పాటు జరగనున్నాయని సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి వెల్లడించారు. కచేరిపేటలోని జిల్లా సీఐటీయూ కార్యాలయం వద్ద అఖిల భారత మహాసభల పోస్టర్లను సీఐటీయూ నేతలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 18–22 తేదీల్లో జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలకు దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వందలాది మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 22న జరిగే బహిరంగ సభలో సీఐటీయూ చేపట్టబోయే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని బేబీరాణి వివరించారు. రానున్న కాలంలో దేశంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు ఏర్పడతాయని, ఆకలి సూచి గరిష్టానికి చేరిందని బేబీరాణి అన్నారు. సీఐటీయూ కార్మిక వర్గపు గొంతుకగా పోరాడే శక్తులకు అండగా నిలబడి దేశంలో త్యాగాల వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, కేపీనాయుడు, డీఏ రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

కాకినాడ సిటీ: కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఒకే కేడర్‌లో పని చేస్తున్న సిబ్బందికి రకరకాల జీతాలు ఉండడం, అందరికీ ఒకే రకమైన వేతనం ఉండాలని 104 ఉద్యోగుల జనరల్ బాడీ సమావేశం డిమాండ్ చేసింది. శనివారం కాకినాడ కచేరిపేటలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో పలువురు యూనియన్ నాయకులు మాట్లాడారు. 15 ఏళ్ల నుంచి ఈ వ్యవస్థ కొనసాగుతుందని, ఆనాటి నుంచి కాంట్రాక్టు ఉద్యోగులుగానే కొనసాగుతున్నామన్నారు. కేడర్ ఒకటే అయిన వేర్వేరు వేతనాలు ఉండడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 62 వాహనాలు ఉన్నాయని, ఒక్కో వాహనంపై డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉంటారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన అశుతోష్ మిశ్రా కమిటీ నివేదికను అమలు చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. ఆ నివేదిక ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, అంత వరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ విషయమై రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశంలో 104 ఉద్యోగుల సంఘం నాయకులు మేడిశెట్టి త్రిమూర్తులు, కేపీ కేశవరావు, పేర్రాజునాయుడు, కె నరసింహ, గుబ్బల రమణ, రత్నంరాజు, కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా మేడిశెట్టి త్రిమూర్తులు, ఉపాధ్యక్షులుగా ఇందుమతి, బత్తిన అనిల్‌కుమార్, తదితరులు ఎన్నుకున్నారు.

కోడిపందేలపై దాడి

కరప: మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేల శిబిరంపై శనివారం కరప పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి, 8 మందిని అరెస్ట్ చేసినట్టు కరప ఎస్‌ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. గొర్రిపూడి, వేములవాడ, విజయరాయుడుపాలెం, గురజనాపల్లి గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్న శిబిరాలపై ఎస్‌ఐ రామకృష్ణ ఏఎస్‌ఐలు జి.ప్రసన్నకుమార్, కె.సూరిబాబు, సిబ్బందితో కలిసి దాడి చేసి ఎనిమిది కోడిపుంజులు, ఎనిమిది కోడికత్తులు, రూ 4,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. అలాగే పెదకొత్తూరు, వాకాడ గ్రామాల్లో గుండాట నిర్వహిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని, వారివద్ద ఉన్న రూ 2,200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

తిరుపతి శృంగార వల్లభుడి దర్శనానికి భక్తుల బారులు

విరాళాలు, టికెట్ల విక్రయాల ద్వారా రూ.2.74 లక్షల ఆదాయం


భక్తుల పూజలందుకంటున్న తిరుపతి శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతిగా పిలిచే శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం భక్తులు బారులు దీరారు. వేకువ జాము నుంచి వందల సంఖ్యలో తరలి వచ్చి గంటల తరబడి క్యూలో నిల్చున్నారు. కాకినాడ జిల్లా దేవదాయ శాఖ కమిషనర్, ఇన్‌చార్జి ఆలయ కార్యనిర్వాహణాధికారి పులి నారాయ ణ మూర్తి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకునేందుకు గంటల తరబడి క్యూలో నిలిచిపోయారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామి వారికి తులసీ మాలంకరణ చేసి దాతలు, భక్తులకు ఆశీర్వచనం అందించారు. ఆలయ భక్తుల నుంచి అన్నదానం, విరాళాలు, టికెట్ల ద్వారా శనివారం ఒక్క రోజు సుమారు రూ.2,74,970 ఆదాయం సమకూరినట్టు ఈఓ పులి నారాయణమూర్తి, తెలిపారు. అనంతరం నిర్వహించిన ఉచిత పులిహోర ప్రసాదంతో పాటు అన్నదానంలో భక్తులు క్యూ కట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్ హాజరు కాగా సుమారు ఆరువేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.


అన్నదానం వద్ద భక్తుల రద్దీ

మందకొడిగా.. కోడి పందేలు


వేట్లపాలెంలో కోడి పందేలు


పెద్దాపురం రూరల్ పరిధిలో ఓ ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడి పందేలు

సామర్లకోట: నియోజకవర్గ పరిధిలో కోడి పందేలు మందకొడిగా ప్రారంభమయ్యాయి. సంక్రాంతిని పురస్కరించుకొని మూడు రోజుల పాటు కోడి పందేలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు భోగి రోజున పోలీసుల అభ్యంతరాల మేరకు ఉదయం 11 గంటల వరకు పందేలు ప్రారంభం కాలేదు. దాంతో మొదటి రోజు పందేలు మందకొడిగా ప్రారంభమయ్యాయి. ఆదివారం సంక్రాంతి కావడంతో కోడి పందేల జోరు పెరిగే అవకాశం ఉంది. పెద్దాపురం మండలంలో పులిమేరు. దివిలి, చంద్రమాంపల్లి, గుడివాడ, కట్టమూరు, ఆర్బీ కొత్తూరు గ్రామాల్లో, సామర్లకోట మండల పరిధిలో జి.మేడపాడు, వేట్లపాలెం, ఉండూరు,మాధవపట్నం, వీకే రాయపురం గ్రామాల్లో కోడి పందేలు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గ పరిధిలో మొదటి రోజు రూ.రెండు కోట్ల వరకు పందేలు జరిగినట్టు తెలిసింది. ఆదివారం పందేలు రూ.పది కోట్ల వరకు జరిగే అవకాశాలు ఉన్నాయి.

బహిరంగంగా..

కొత్తపల్లి: మండలంలో కోడి పందేలు బహిరంగంగానే నిర్వహిస్తున్నారు. వాకతిప్ప, నాగులాపల్లి, ఇసుకపల్లి, కోనపాపపేట, కొమరగిరి, కొండెవరం, గోర్స తదితర గ్రామాల్లో జోరుగా సాగుతున్నాయి. రాత్రిళ్ల సైతం నిర్వహించేందుకు లైట్లు ఏర్పాటు చేశారు. శనివారం ఒక్క రోజూ రూ.లక్షల్లో పందేలు జరిగినట్టు సమాచారం.

పెద్దాపురంలో జోరుగా..

పెద్దాపురం: పెద్దాపురం సెగ్మెంట్‌లో తొలిరోజు భోగి పండగను పురస్కరించుకుని కోడి పందేలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఏటిపట్టు గ్రామాల్లో రెండు, మూడు చోట్ల, మెట్ట ప్రాంతంలోని మరో రెండు చోట్ల నాయకులు కొందరు మధ్యవర్తిత్వం వహించి పందేలకు సిద్ధం చేశారు.

మహాసాధ్వి.. కావమ్మ

- భర్త మరణంతో సతీసహగమనం
- నేటి నుంచి మూడు రోజుల పాటు తిరునాళ్లు


ఆలయంలోని కావమ్మ, మారెయ్య


సామర్లకోటలో కావమ్మ ఆలయం

సామర్లకోట: స్థానిక రజకవీధిలో వేంచేసిన కావమ్మ ఆలయంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు తిరునాళ్లు జరుగుతాయి. స్థానిక బెస్తా కులానికి చెందిన సుకపట్ల లక్ష్మయ్య, వెంకయమ్మ దంపతులకు చెందిన కావమ్మ కాత్యాయిని వరంతో జన్మించింది. చిన్న వయస్సులోనే ఈశ్వర సంభూతుడైన మారయ్యను వివాహం చేసుకొంది. వివాహమైన తరువాత మారయ్య మద్రాసులోని దొర వద్ద బోయిలందరికి పెద్ద బోయిగా నెలకు ఆరు వరహాల జీతానికి చేరాడు. ఆరేళ్ల తరువాత తన భార్యను చూడాలనిపించి మద్రాసు దొరల వద్ద సెలవు తీసుకొని ఓడరేవుకు చేరుకున్నాడు. మారెయ్య వచ్చే సమయానికి ఓడ వెళ్లి పోవడంతో మరో మార్గం లేక కాలినడకన సామర్లకోటకు బయలు దేరాడు. కాకినాడ సమీపంలోని చేరే సమయానికి భరించలేని కడుపు నొప్పి రావడంతో సామర్లకోట చేరిన తరువాత మృతి చెందాడు.

భర్త మరణం తెలుసుకున్న కావమ్మ సతీసహగమనం చేయడానికి దొరల అనుమతి కోరింది. దొరల అంగీకారంతో స్థానిక రజకపేట సమీపంలో ఉన్న ఏలేరు కాలువ చెంతనే భర్త చితిపై కావమ్మ సతీసహగమనం చేసింది. మృతదేహం కాలి పోయినా కావమ్మ కాలి మెట్టెలు, తాలిబొట్టు మిగిలిపోవడంతో కావమ్మ మహిమ గల దేవతగా భావించి సతీసహగమనం చేసుకున్న ప్రదేశంలో కావమ్మ, మారెయ్యల విగ్రహాలతో ఆలయాన్ని నిర్మించారు. కావమ్మను స్నానం చేయించిన ప్రదేశంలో బావిని ఏర్పాటు చేశారు. నేటికి ఆ బావి నీటితో ఉంటుంది. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని తిరునాళ్లు జరుగుతాయి. కావమ్మ తిరునాళ్లకు వచ్చిన గర్భిణులు పండ్లను నీటిలో వేయడం ద్వారా తేలితే మగ బిడ్డగా, మునిగితే ఆడ బిడ్డగా భావిస్తారు. ఏటా మారెయ్య, కావమ్మ వారసులు సుకపట్ల ఆదినారాయణ, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయి. ఆదివారం నుంచి జరిగే ఉత్సవాలను తిలకించడానికి అనేక గ్రామాలకు చెందిన భక్తులు తరలి వస్తారు. ఆలయానికి చేరుకోవడానికి ఏలేరు కాలువపై కాలిబాట వంతెన నిర్మించారు.